సాక్షి సంగారెడ్డి

సోమవారం ၊ 15 ၊ జూలై ၊ 2024



చెక్‌పోస్టులు ఎత్తేద్దామా?

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను ఎత్తివేయాలని రవాణా శాఖ యోచిస్తోంది. వివరాలు 8లో ▸



జాబ్‌మేళా.. భళా

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరంగా మారాయి. వివరాలు 8లో ▸



మా గోడు పట్టించుకోండి

హత్నూర బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఉదయం 9.30 అవుతున్నా టిఫిన్ పెట్టడం లేదని నిరసన వ్యక్తం చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మంజీరా సర్వోదయ మహిళలకు చేయూత



ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

పుల్‌కల్(అందోల్): మండలంలోని గోంగ్లూర్ గ్రామంలో మంజీరా సర్వోదయ మహిళలు చేస్తున్న ఉత్పత్తులను ఆదివారం ఎస్పీ రూపేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తయారు చేస్తున్న వంటనూనెలు, సబ్బులను పోలీస్ క్యాంటీన్‌లో కూడా విక్రయాలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు గోంగ్లూర్ మహిళలకు అన్ని రకాలుగా సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ నాయక్, డీసీసీపీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, మంజీర సర్వోదయ సంస్థ మేనేజర్ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బ్యుటిషియన్ కోర్సులపై సెమినార్



అవగాహన కల్పిస్తున్న మేకప్ ఆర్టిస్ట్ లత

జహీరాబాద్: బ్యుటిషియన్ కోర్సులు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ఆదివారం స్థానిక అతిథి ఇన్ హోటల్‌లో సెమినార్ నిర్వహించారు. సంగారెడ్డి దుర్గాబాయి శిశు వికాస్ కేంద్రం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 120 మంది మహిళలు పాల్గొన్నారు. లతాస్ బ్యూటీ హబ్ ఫౌండర్, ట్యూటర్ లత కోర్సుపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు ఆరు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు లత పేర్కొన్నారు. కార్యక్రమంలో నిఖిత, అనూష, సృజన, భవాని, సింధు, ప్రతిష్ట, వసుంధర, రవికుమార్ పాల్గొన్నారు.

శివపంచాక్షరీ మంత్రం ఎంతో శ్రేష్టమైంది



సత్యవాణిని సన్మానిస్తున్న వీరశైవ సమాజం చౌకిమఠం మహిళా సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): శివపంచాక్షరీ మంత్రం ఎంతో శ్రేష్టమైందని, సామూహికంగా ఉచ్ఛరించడం ద్వారా గొప్ప ఫలితం ఉంటుందని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త శ్రీమతి సత్యవాణి, శివయోగిశివాచార్య మహాస్వామి పేర్కొన్నారు. రెండవ రోజు ఆదివారం స్థానిక బసవ సేవాసదన్‌లో వీరశైవ సమాజం చౌకిమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివపంచాక్షరీ జపయజ్ఞ సామూహిక ఇష్ట లింగార్చన కార్యక్రమంలో భాగంగా వక్తలు ప్రవచనం, శివాచార్యుల ధర్మ సందేశం ఇచ్చారు. కాశీ జ్ఞాన సింహాసనదీశ్వర జగద్గురువులు, డాక్టర్ చంద్రశేఖర శివాచార్య, చీలమల్లన్న, పిల్లోడి విశ్వనాథం, బోడగామ శ్రీశైలం, పులుమామిడి వీరేశం, అర్చన పాల్గొన్నారు.

ఘన సన్మానం



నథానియల్‌ను సత్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్ కోర్టు ఏజీపీగా నియమితులైన నథానియల్‌ను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు సన్మానించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

పటాన్‌చెరు టౌన్ : పట్టణంలో కురిసిన ఈదురు గాలుల వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ, చైతన్య స్కూల్ సమీపంలో కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో 45 నిమిషాల పాటు సేపు విద్యుత్ నిలిచిపోయింది. అధికారులు చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



శాకాంబరి దేవిగా ఎల్లమ్మ

ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా రేణుకా ఎల్లమ్మ తల్లి శాకాంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మహేష్ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పటాన్‌చెరు టౌన్:

సల్లంగా సూడమ్మ తల్లీ..



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఆదివారం బోనాల పండగను సంబురంగా జరుపుకున్నారు. మహిళలంతా బోనం కుండలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తుల నృత్యాలు అలరించాయి.

– రాయికోడ్ (అందోల్) :

ఎరువు.. బరువు

రైతుపై రవాణా భారం

- రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల బస్తాకు రూ.30వరకు అదనం
- సహకార సంఘాల కంటే ధర అధికం
- మినహాయింపు ఇవ్వాలని డీసీఎంఎస్ విజ్ఞప్తి
- ఉమ్మడి జిల్లాలో ఎఫ్‌ఎస్‌సీల ద్వారానే ఎక్కువగా సరఫరా



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రైతుసేవా కేంద్రాల (ఎఫ్‌ఎస్‌సీ)లో ఎరువులు కొంటున్న రైతులపై రవాణా భారం పడుతోంది. ఒక్కో బస్తాపై రూ.20 నుంచి రూ.30లు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ప్రధానంగా యూరియానే తీసుకుంటే 50 కిలోల బస్తాను సహకార సంఘాల్లో కొంటే రూ.270 చెల్లించాల్సి వస్తుండగా, అదే రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేసిన రైతులకు రవాణా చార్జీలు అదనంగా పడుతుండటంతో రూ.290 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీని ధర రూ.266.50 మాత్రమే. ప్రధానంగా యూరియా ఎరువులపై ఈ భారం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ఎరువును అధికంగా వరి, మొక్కజొన్న పంటలకు వాడుతుంటారు. పంట మొలకెత్తాక ఒకసారి, ఎదుగుదల కోసం వివిధ దశల్లో యూరియాను వాడుతుంటారు. ఈ ఎరువులపై రవాణా చార్జీలు రైతులకు భారంగా మారుతున్నాయి.

రైతుసేవా కేంద్రాల ద్వారానే అధికంగా సరఫరా

జిల్లాలో సహకార సంఘాల కంటే రైతుసేవా కేంద్రాల ద్వారానే ఎక్కువ మంది రైతులకు ఎరువులు సరఫరా జరుగుతోంది. జిల్లాలోని పలు సహకార సంఘాలు నష్టాల ఊబిలో కూరుకు పోయాయి. నిర్వహణ కూడా గాలికొదిలేయడంతో ఈ సంఘాల సేవలు నిర్వీర్యమయ్యాయి. దీంతో కొన్ని సంఘాలు ఎరువుల పంపిణీపై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ఆయా సంఘాల పరిధిలో రైతుసేవా కేంద్రాల ద్వారానే ఎరువుల సరఫరా జరుగుతోంది. ఇక్కడ ఎరువులు కొంటున్న రైతులు అధిక ధరలకు చెల్లించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా	రైతుసేవా కేంద్రాలు
సంగారెడ్డి	37
సిద్దిపేట	38
మెదక్	16

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2023–24లో రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసిన ఎరువులు : 19,343 మెట్రిక్ టన్నులు.

చార్జీలు మినహాయించాలని విజ్ఞప్తి..

సహకార సంఘాల మాదిరిగానే రైతుసేవా కేంద్రాలకు కూడా రవాణా చార్జీల నుంచి మినహాయింపు ఇవ్వాలని డీసీఎంఎస్ నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్లాయి. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పరిస్థితిని వివరించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ఎందుకీ పరిస్థితి..?

ప్రభుత్వం సహకార సంఘాలతో పాటు, రైతుసేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువులు పంపిణీ చేస్తోంది. సహకార సంఘాలకు సరఫరా చేస్తున్న ఎరువులకు సంబంధించిన రవాణా ఛార్జీలు (లారీ కిరాయి) ప్రభుత్వమే భరిస్తుంది. కానీ రైతుసేవా కేంద్రాలకు మాత్రం ప్రభుత్వం ఈ చార్జీలను చెల్లించడం లేదు. సహకార సంఘాల మాదిరిగానే రైతుసేవా కేంద్రాలు కూడా డీసీఎంఎస్ (జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ) ఏర్పాటు చేసినవే కావడం గమనార్హం. మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వేరేక్ పాయింట్ లేదు. మేడ్చల్ జిల్లా పరిధిలోని గోదాంల నుంచి ఎరువులు జిల్లాకు రవాణా చేయాల్సి ఉంటుంది. దీంతో లారీ కిరాయిలు అదనంగా పడుతున్నాయి.

పర్యాటక ప్రాంతంగా బోరంచ

- స్టేట్ కన్జర్వేటర్‌తో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్థలాల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

నారాయణఖేడ్: మనూరు మండలంలోని మంజీరానది సమీపంలో ఉన్న బోరంచ నల్లపోచమ్మ ఆలయ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధికి అందుబాటులో ఉన్న భూముల వివరాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఇటీవల అందజేసినట్లు చెప్పారు. దీంతో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కోసం మంత్రి ఆదేశాల మేరకు అటవీశాఖ ప్రధాన కార్యాలయ కన్జర్వేటర్ కృష్ణ ఆదివారం ఎమ్మెల్యేతో కలిసి బోరంచను సందర్శించారు. ఆలయ సమీపంలో అనుకూలంగా ఉన్న భూములు, మంజీరా నదిని పరిశీలించారు. నల్లపోచమ్మ, సంగమేశ్వర, సాంబశివ ఆలయాలను సందర్శించి ఆయా దేవతా మూర్తులను దర్శించుకున్నారు. నల్లపోచమ్మ ఆలయప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అనువైన భూములు, వాతావరణం ఉందని అధికారి తెలిపారు. మాజీ సర్పంచ్‌లు దిగంబర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజు, నాయకులు శేఖర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్, నర్సింహులు ఉన్నారు.

ఇట్టయితే.. చదువు సాగేదెట్లా?

- సర్కార్ బడుల్లో ఉపాధ్యాయుల కొరత
- కొన్నిచోట్ల అవసరానికి మించి సిబ్బంది
- బదిలీపై కొత్తవారు రాకపోవడంతో పాత వారినే కొనసాగింపు



అర్జున్‌నాయక్ తండా పాఠశాలలో 109 మంది విద్యార్థులకు ఏకైక ఉపాధ్యాయుడు

జహీరాబాద్: ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పంతుళ్లు లేరు. దీంతో విద్యాబోధన సక్రమంగా సాగక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మాత్రం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇదీ పరిస్థితి..

జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో 109 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నాడు. అలాగే రంజోల్‌లోని ప్రాథమిక పాఠశాలలో 102 మంది విద్యార్థులు ఉండగా అక్కడ ఇద్దరు టీచర్లే ఉన్నారు. ఉర్దూ మీడియంలో 69 మంది విద్యార్థులుండగా అక్కడా ఇద్దరే కొనసాగుతున్నారు. కొత్తూర్(బి)లో ప్రాథమికోన్నత పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు విద్యాబోధన చేస్తున్నాడు. అయితే ప్రాథమిక పాఠశాలలో 43 మంది విద్యార్థులే ఉన్నా నలుగురు ఉపాధ్యాయులున్నారు. హుగ్గెలి ప్రాథమిక పాఠశాలలో 57 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులున్నారు. హుగ్గెల్లి తండాలో 13 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. యూపీఎస్ నంబర్ 1 పాఠశాలలో 109 మంది విద్యార్థులుంటే ఏకంగా 8 మంది ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు.

ఇక్కడ ఇలా..

కాశీంపూర్‌లో 9తరగతుల్లో 190 మంది విద్యార్థులుండగా, అక్కడ కేవలం ఐదుగురు ఉపాధ్యాయులే ఉన్నారు. మధులై తండాలో కేవలం 18 మంది విద్యార్థులుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. రంజోల్‌లోని ప్రాథమిక పాఠశాలలో 102 మంది విద్యార్థులుంటే కేవలం ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారు. లచ్చానాయక్ తండాలో 18 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు.

కొత్తవారు రాకపోవడంతో..

ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఇందులో భాగంగా జహీరాబాద్ మండలం నుంచి 117 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో బదిలీపై రావాల్సిన వారిలో కొందరే రావడంతో పాత వారిని రిలీవ్ చేయలేదు. కేవలం 11 మంది ఉపాధ్యాయులను మాత్రమే రిలీవ్ చేశారు. మొగుడంపల్లి మండలం నుంచి 51 మంది ఉపాధ్యాయులకు బదిలీలు అయ్యాయి. వీరిలో 19 మందిని మాత్రమే రిలీవ్ చేశారు. కొత్తవారు విధుల్లో చేరాకే బదిలీ చేయనున్నట్లు ఎంఈఓ బస్వరాజ్ పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు వీలుగా పాత వారిని రిలీవ్ చేయలేదన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న పాఠశాలల్లో అవసరం మేరకు ఉపాధ్యాయులను నియమించేలా చూస్తామన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఉపాధ్యాయులు అధికంగా ఉంటే వారిని అవసరం ఉన్న చోట ఉపయోగించుకునే విషయాన్ని పరిశీలిస్తామన్నారు.

ఈ రోడ్డెక్కితే నరకమే..



కంకర తేలిన రోడ్డు



వట్‌పల్లి సమీపంలో నడిరోడ్డుపై గుంత

- అధ్వానంగా అల్లాదుర్గ్ – మెటల్‌కుంటా రోడ్డు
- 17 కిలోమీటర్ల మేర గుంతలమయం

వట్‌పల్లి(అందోల్): అందోల్ నియోజకవర్గ పరిధిలోని అల్లాదుర్గ్ ఐబీ నుంచి వట్‌పల్లి మీదుగా మెటల్‌కుంటా రోడ్డు అధ్వానంగా మారింది. ఎనిమిదేళ్లకు పైగా నిర్వహణ కొరవడటంతో అడుగుకో గుంత ఏర్పడి వాహనదారులు నరకం చూస్తున్నారు. ఈ రహదారిపై నుంచి మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు రాకపోకలు కొనసాగుతుంటాయి. గత ప్రభుత్వం ఈ రోడ్డు దుస్థితిని పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అడుగుకో గుంత...

రోడ్డు పొడవునా 17కిలోమీటర్ల దూరం వరకు అడుగడుగునా గుంతలు ఉన్నాయి. వర్షాకాలం కావడంతో రోడ్డుపై ఉన్న గుంతలలో నీరు నిలుస్తున్నాయి. ఆ మడుగుల్లో భారీ వాహనాలు ఇరుక్కుపోయిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం రోడ్డు మరమ్మతుల కోసం రూ.3 కోట్ల నిధులను మంజూరు చేసింది. టెండర్లకు ఆహ్వానించగా బిల్లులు చెల్లింపులు సరిగ్గా జరగడం లేదని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఇలా ఏడుసార్లు టెండర్లను పిలిచినా ఉపయోగం లేకుండా పోయింది.

మంత్రి హామీ అమలుకు ఎదురుచూపు

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో దామోదర రాజనర్సింహా అల్లాదుర్గ్– మెటల్‌కుంటా రోడ్డు దుస్థితిపై ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తానని హామీ కూడా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తుంది. అంతేకాకుండా దామోదర మంత్రి కూడా అయ్యారు. కానీ ఈ రోడ్డు దుస్థితి మాత్రం మారలేదు.

ప్రతిపాదనలు పంపించాం

అల్లాదుర్గ్ ఐబీ నుంచి మెటల్‌కుంటా వెళ్లే రోడ్డును నూతనంగా నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు 17కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.36 కోట్ల వ్యయ అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఎన్నికల కోడ్ ఉండడంతో కొంత ఆలస్యమైంది. ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

– రాంబాబు, ఆర్అండ్‌బీ ఈఈ, సంగారెడ్డి

భక్తిశ్రద్ధలతో పస్కా ఉత్సవం

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని డాకూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పస్కా ఉత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, అందోల్ తహసీల్దార్ భాస్కర్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.



ఉత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి దామోదర

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం



ఎంపీ సురేష్‌షెట్కార్‌ను సత్కరిస్తున్న నాయకులు

జహీరాబాద్: అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తానని ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. ఆదివారం లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బసవ మండపం, జమాతే ఉలేమా సంస్థ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ప్రజలంతా కులమతాలకతీతంగా ఓటు వేసి గెలిపించారన్నారు. తనపై నమ్మకం ఉంచినందుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాననన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, నాయకులు రాజశేఖర్, బస్వరాజ్ పాటిల్, సోమశేఖర్‌పాటిల్, ఆర్.సుభాష్, శంకర్‌పాటిల్, వైద్యనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జి.అశోక్ పాల్గొన్నారు.

సరికొత్తగా 'అంగన్ బడి'

పిల్లల సంఖ్య పెంపునకు ప్రత్యేక డ్రైవ్

'అమ్మ మాట అంగన్‌వాడీ బాట'కు శ్రీకారం

- నేటి నుంచి ఈనెల 20వరకు ప్రతిరోజూ ఒక ప్రత్యేక కార్యక్రమం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పిల్లలకు తొలి ఒడి అమ్మ అయితే.. మలిఒడి అంగన్‌వాడీ కేంద్రాలే కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'ను ప్రారంభించనుంది. సోమవారం నుంచి ఈనెల 20వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఐసీడీఎస్ సిబ్బంది సిద్ధమయ్యారు. ఇప్పటికే దీనికి సంబంధించి అంగన్వాడీ టీచర్లకు విడతల వారిగా శిక్షణ ఇచ్చారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చిన్నారులకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తారు. ఇందుకు సంబంధించిన సామగ్రిని సిబ్బందికి అందుబాటులో ఉంచారు.

కార్యాచరణ ఇలా...

- ఈ నెల 15, 16వ తేదీల్లో అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, బాలికలు, డ్వాక్రా సంఘం ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రుల సహకారంతో ర్యాలీలు నిర్వహిస్తారు. అలాగే అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతారు. పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉన్న బాలికలను గుర్తిస్తారు.
- 18న ఇంటింటికీ తిరిగి రెండున్నరేళ్ల వయసున్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతారు. బోధనా పద్ధతులు, చిన్నారుల వివరాలను నమోదు చేయడం, ఐదేళ్లు పూర్తైన వారికి అంగన్వాడీ నుంచి ప్రీ స్కూల్ సర్టిఫికెట్ అందజేస్తారు.
- 19న అంగన్వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత పాటిస్తారు. మొక్కలు నాటడం, కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్డి సదుపాయాలు కల్పించడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- 20న ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్‌మెంట్ డే, సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నానమ్మ, అమ్మమ్మలను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి అవగాహన కల్పిస్తారు. బోధన, ఆట వస్తువులను ప్రదర్శించి, పిల్లల తల్లిదండ్రులను సన్మానిస్తారు.



నందికంది అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్ విజయలక్ష్మి (ఫైల్)

అందరూ సహకరించాలి

ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో రోజువారీగా కార్యక్రమాలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించి టీచర్లకు శిక్షణ తరగతులను నిర్వహించాం. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– లలిత కుమారి, జిల్లా ఐసీడీఎస్ అధికారి

క్లుప్తంగా

ఈ బైక్ ఎవరిది?


గుర్తు తెలియని బైక్

పాపన్నపేట(మెదక్): ఏడు పాయల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఎండో మెంట్ కార్యాలయం వద్ద బైక్ వదిలి వెళ్లారు. వారం రోజులుగా కార్యాలయం పక్కనే బైక్ ఉంటున్నా దేవస్థాన సిబ్బంది పట్టించుకోక పోవడం గమనార్హం. మంజీరా నదిలో ఏటా పదుల సంఖ్యలో భక్తులు చనిపోతున్నా కూడా ఆలయ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటు సెక్యూరిటీ ఉద్యోగులు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వడం లేదు. బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి విచారణ చేయాలని భక్తులు కోరుతున్నారు.

విద్యుత్ సంస్థను ప్రైవేటుకు అప్పగిస్తే ఉద్యమమే

సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి


మాట్లాడుతున్న మహేందర్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: రాష్ట్రంలో ఏ ఒక్క విద్యుత్ సర్కిల్, ఫీడర్ కంపెనీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని, అలా చేస్తే ఉద్యమం తప్పదని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని నర్సాపూర్ రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ఆవరణలో ఆదివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (టీఎస్‌ఈయూఈఈయూ) మెదక్ డివిజన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే సౌత్ సర్కిల్లో అదానీ గ్రూప్ సర్వేలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ మాత్రం బహిరంగంగా ఆ సంస్థకు కట్టబెడుతున్నట్లు ప్రకటించకుండా చాప కింద నీరులా వారితో ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో సర్కార్ అనుమతి లేకుండా అదానీ గ్రూప్ ఎలా సర్వేలు చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, అదానీకి మధ్య జరిగిన చీకటి ఒప్పందాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సౌత్ సర్కిల్ పరిధిలో కరెంటు దొంగతనం జరుగుతుందనేది నిజమేనని, బిల్లులు వసూలు చేయడానికి వెళ్లిన సిబ్బందిపై దాడులు జరుగుతున్నది వాస్తవమన్నారు. మెదక్ జిల్లాలో ఆర్టిజన్స్ అధికారుల వేధింపుల ఆపాలని, మెదక్ జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జీ.రవీంద్ర ప్రసాద్, ఎం.నర్సింలు, సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు, సురేశ్, శ్రీను, నాగరాజు, మల్లేశ్, రాములు, నరేశ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలో శనివారం రాత్రి దొంగలు హల్ చల్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో తాళం వేసి ఉన్న అడ్వకేట్ శంకర్ రెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి అర తులం బంగారు కమ్మలు ఎత్తుకెళ్లారు. దీంతోపాటు నిక్కీ వైన్స్‌కు కన్నం వేసి మద్యం బాటిళ్లు, కౌంటర్‌లో ఉన్న నగదును అపహరించారు. అలాగే, మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఆంజనేయులు కిరాణా దుకాణంలో వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ దొంగలతోపాటు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డ దొంగలను పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.

చెక్ పోస్టులు ఎత్తేద్దామా?

- మెరుగైన ఆర్టీఏ సేవల కోసం అధ్యయనం
- డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీల జారీ విధానం కేంద్రీకృతం
- ఐదు రాష్ట్రాలకు వెళ్లొచ్చి నివేదికలిచ్చిన ఐదు జిల్లాల డీటీసీలు
- ఆయా రాష్ట్రాల్లో వాహన ట్యాక్స్‌లపై పరిశీలన
- ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషణ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను ఎత్తివేయాలని రవాణా శాఖ యోచిస్తోంది. వాటి స్థానంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా ట్యాక్స్ ఎగవేస్తున్న వాహనాలకు చెక్ పెట్టవచ్చని భావిస్తోంది. ఈ అంశంతోపాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు మరో ఎనిమిది అంశాల్లో వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న విధానాలను అధ్యయనం చేస్తోంది. ఈ మేరకు జిల్లాల్లోని ఐదుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లను ఐదు రాష్ట్రాలకు పంపింది. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్రలకు డీటీసీల బృందాలు ఇటీవలె వెళ్లి ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న ఆర్టీఏ సేవలను అధ్యయనం చేశారు. ఈ మేరకు తొమ్మిది అంశాలపై ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇచ్చారు.

- ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్లు.. ప్రస్తుతం వాహనాల ఫిట్‌నెస్‌లను ఎంవీఐలు పరిశీలిస్తున్నారు. ఈ ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడంతో ఈ ఫిటనెస్ పరీక్షలు మరింత పకడ్బందీగా నిర్వహించొచ్చని భావిస్తున్నారు.
- కాలం చెల్లించిన వాహనాలు రోడ్లపై తిరగడం ద్వారా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఈ వాహనాల స్క్రాపింగ్‌కు ఎలాంటి విధానం అవలంభిస్తున్నారనే అంశంపై అధికారులు అధ్యయనం చేశారు.
- ప్రస్తుతం రాష్ట్ర రవాణాశాఖ పోర్టల్‌ను నిర్వహిస్తోంది. ఈ పోర్టల్‌ను కేంద్రానికి చెందిన వాహన్/సారథి పోర్టల్‌కు అనుసంధానం చేయాలా? వద్దా అనే అంశంపైనా ఈ అధికారుల బృందాలు పరిశీలన చేసింది. ప్రస్తుతం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందుతున్నాయి. ఆయా రాష్ట్రాల పోర్టల్‌లలో ఉన్న మంచి ఆప్షన్లు ఏవనే అంశంపై అధికారుల పరిశీలన కొనసాగింది.
- ఇతర రాష్ట్రాల్లో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను అధికారులు పరిశీలించారు. ఈ ట్రాక్‌లను ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసేటప్పుడు వాహనదారుడు చేస్తున్న తప్పులు సెన్సార్లు గుర్తించి రిపోర్టులు ఇస్తుంది. దీంతో డ్రైవింగ్ టెస్ట్ పకడ్బందీగా నిర్వహించేందుకు వీలు కలుగుతుంది.
- ప్రస్తుతం ఆయా రవాణాశాఖ కార్యాలయాల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు జారీ చేస్తున్నారు. ఆయా కార్యాలయంలోనే వీటిని ముద్రించి వాహనదారులకు అందజేస్తున్నారు. ఈ విధానంలో కొన్ని లోపాలు ఉన్నాయి. దీన్ని అధిగమించేందుకు ఈ విధానాన్ని సెంట్రలైజ్ చేసి డిజిటల్/ స్మార్ట్ కార్డులను నేరుగా వినియోగదారులకు పంపే విధానంపై అధ్యయనం కొనసాగింది.
- రవాణా శాఖ ద్వారా రాష్ట్ర ఖజానాను మరింత నింపుకునేందుకు ఆయా రాష్ట్రాల్లో వాహనాల ట్యాక్స్‌ల విధానాన్ని కూడా ఈ అధికారుల బృందం పరిశీలించింది. వాహన క్యాటగిరీల వారీగా ఎంత ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. వాటికి తెలంగాణలో ఎంత ట్యాక్స్ ఉందనేదానిపై బేరీజు వేసుకోనున్నారు. ఈ ట్యాక్స్‌ల్లో మార్పులు చేర్పులు చేయడం ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది.
- ఆయా రాష్ట్రాల్లోని రవాణాశాఖ ట్యాక్స్‌ల ద్వారా మూడేళ్లలో ఎంత మొత్తంలో ఆదాయం లభించింది. అలాగే ఆయా వాహనాలు, ఇతర రికార్డుల నిర్వహణపైన కూడా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ల బృందం పరిశీలన చేసింది.



సదాశివపేట పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో నిరుపయోగంగా గాలిపంపు

గాలికొదిలేశారు

- పెట్రోల్ బంకుల్లో పనిచేయని గాలి నింపే యంత్రాలు
- తాగునీటి, ప్రథమ చికిత్స సదుపాయాలు కరువు
- ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని యాజమాన్యాలు

సదాశివపేట(సంగారెడ్డి): పెట్రోల్ పంపుల యాజమాన్యాలు వినియోగదారులకు సరైన వసతులు కల్పించడం లేదు. బంకుల్లో గాలి నింపే యంత్రాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ పోసుకునే ప్రతీ వినియోగదారుడి వాహనంలో గాలి నింపే సౌకర్యాన్ని ఉచితంగా ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ ఆయా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో బయట వాహనాల్లో గాలి నింపుకుందామంటే నిలువునా దోచుకుంటున్నారు.

సంగారెడ్డి జిల్లాలో హెచ్‌పీ, భారత్, రిలయన్స్ వంటి కంపెనీలకు సంబంధించి 200 వరకు పెట్రోల్ పంపులు ఉన్నాయి. ప్రతీ పెట్రోల్ పంపులో టాయిలెట్లు గాలి నింపే పంపులు ఉన్నాయి. అందులో టాయిలెట్లు పని చేస్తున్నప్పటికీ గాలి పంపులు మాత్రం పని చేయడం లేదు. గాలి పంపులు కేవలం అలంకార ప్రాయంగా మారాయి. ఎప్పుడు చూసినా ఈ రోజే పనిచేయడం లేదని చెప్పి వినియోగదారులను వెనక్కి పంపిస్తున్నారు.

నిబంధనలు గాలికి

కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రతీ కంపెనీకి సంబంధించిన పెట్రోల్ పంపుల్లో వినియోగదారులకు టాయిలెట్లు, వాహనాల టైర్లలో గాలి నింపే సౌకర్యాలు కల్పించాలి. అందుకోసం ఆయా కంపెనీలకు ప్రభుత్వం డబ్బులు కూడా చెల్లిస్తుంది. జిల్లాలో వ్యాప్తంగా 200 పై చిలుకు పెట్రోలు పంపులు ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని 647 పంచాయతీలతోపాటు సదాశివపేట, సంగారెడ్డి, పటాన్చెరు, జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, జిన్నారం, అమీన్‌పూర్, తెల్లాపూర్, రామచంద్రాపూరం మున్సిపాలిటీలు, పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని కంపెనీలకు సంబంధించి పెట్రోల్ బంకులు ఉన్నాయి. మెజార్టీ పెట్రోలు పంపుల్లో గాలి నింపే పంపులు పనిచేయడం లేదని సమాచారం. అలాగే వీటిపై ఫిర్యాదు చేయడానికి ప్రతీ పెట్రోల్ పంపుల్లో సేల్స్ ఆఫీసర్, ఫీల్డ్ ఆఫీసర్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లు ఉండాలి కానీ ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రతీ నెలా ఆయా కంపెనీల అధికారులు బంకుల్లో తనిఖీలు చేయాల్సి ఉన్నా చేయడం లేదు.

రూ.10 చొప్పున వసూలు..

బయటి గాలి పంపుల్లో ఇది వరకు ఏదైనా వాహనం టైర్‌కు గాలి నింపితే రూ.5 వసూలు చేశారు. కానీ ప్రస్తుతం టైర్‌కు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే అంతే అంటూ సమాధానం ఇస్తున్నారు. గాలి పంపుల యజమానులు సిండికేట్‌గా మారి ఇలా వసూలు చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్మిక సంక్షేమం కోసం కృషి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం


మాట్లాడుతున్న దర్పల్లి చంద్రం

మనోహరాబాద్(తూప్రాన్): భవన నిర్మాణ కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్నామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్పల్లి చంద్రం అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల బంగారమ్మ దేవాలయం వద్ద నూతన కార్మిక సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, గ్రామ ప్రధాన కూడలి వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో 14 రకాల కార్మికులు పని చేస్తారని, వారందరూ నిరంతరం ప్రమాదంతో కూడిన పనులు చేస్తారన్నారు. వారికి అండగా ఉండటానికి ప్రత్యేక భద్రత కార్డు ఉందని, ప్రతి ఒక్కరూ ఆ కార్డును వినియోగించుకోవాలన్నారు. ప్రమాదంలో కార్మికుడు మరణిస్తే కార్డు ఉన్న వారికి రూ.6 లక్షల బీమా వర్తిస్తుందని, ఆడపిల్ల ఉంటే వారికి లబ్ధి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, సిద్దిపేట అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు శ్రీనివాస్, మహేశ్, యాదగిరి, మహేందర్, యేశం వెంకటేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, మేస్త్రీలు, సెంట్రింగ్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని తప్పించబోయి..

ఆటో బోల్తా, నలుగురికి గాయాలు


బోల్తాపడిన ఆటో

హవేళిఘణాపూర్(మెదక్): స్కూటీని తప్పించబోయే క్రమంలో ఆటో బోల్తా పడటంతో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన హవేళిఘణాపూర్ మండలం నాగాపూర్ గేట్ నక్కవాగు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోల్కొంగాలకు చెందిన ఓ వ్యక్తి మెదక్ నుంచి స్కూటీపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. మండల పరిధిలోని నక్కవాగు వద్దకు రాగానే లారీని ఓవర్ టెక్ చేయబోయి గాజిరెడ్డిపల్లి నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఆటోకు ఎదురుగా వెళ్లాడు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ స్కూటీని తప్పించబోయే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాజిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మి, బూర్గుపల్లికి చెందిన చాకలి కృష్ణకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయా లయ్యాయి. వెంటనే వీరిని అంబులెన్సులో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ

నగదు, ఆభరణాలు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ షేక్ మహబూబ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇళ్లల్లో చొరబడి నగదు, వెండి, బియ్యం దోచుకెళ్లారు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో ఆదివారం వెలుగు చూసింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైజాబాద్ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తాళ్ల కృష్ణ దంపతులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కొడిపల్లి దేవులపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటితాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. కృష్ణ ఇంటికొచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడగా రూ.19 వేల నగదు, 25 తులాల వెండి, 150 కిలోల బియ్యం అపహరణకు గురయ్యాయని తెలిపారు. అలాగే కృష్ణ ఇంటి పక్కనే ఉన్న తాళ్ల బాల మల్లయ్య ఇంటి తాళం పగులగొట్టడానికి దుండగులు యత్నించగా, శబ్దం రావడంతో పక్కింటి వారు అరవగా పారిపోయారన్నారు. గ్రామ శివారులో ఉన్న ఓ బర్రెల షెడ్‌లో కట్టేసిన ఐదు గొర్రెలను సైతం దొంగిలించారన్నారు. గ్రామంలో వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఘటనా స్థలాలను పోలీసులు పరిశీలించారు.

గుట్కా, పాన్ మసాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న, గుట్కా ప్యాకెట్లు

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వ నిషేధిత గుట్కా పాన్ మసాలాలను పోలీసులు పట్టుకున్న ఘటన దౌల్తాబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్ ఎదురుగా దేవులపల్లి గ్రామానికి చెందిన మన్నే పండరి పాన్ డబ్బా నడుపుతున్నాడు. అందులో ప్రభుత్వ నిషేధిత గుట్కా, తంబాకు అమ్ముతున్నాడని సమాచారం అందింది. సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా అతడి వద్ద రూ.30 వేలు విలువ చేసే గుట్కా, పాన్ మసాలా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. పండరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను తంబాకు పదార్థాలను ఎవరూ విక్రయించొద్దని హెచ్చరించారు. ఎవరైనా అమ్మినట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 100 లేదా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712661845, 8712656752 లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్


మాట్లాడుతున్న మంద పవన్

బెజ్జంకి(సిద్దిపేట) : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ సూచించారు. బెజ్జంకిలో మండల పార్టీ కౌన్సిల్ సమావేశాన్ని మండల సహాయ కార్యదర్శి పండుగ పరుశరాములు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా ఉద్యోగ నియామకాలు లేక యువత ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలకు నోచుకోలేని పేదలున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతతత్వ రాజకీయాలను మానుకొని పేదల సంక్షేమానికి పాటుపడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి రూపేశ్, బోనగిరి మహేందర్, సంగెం మధు, మహేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా.. భళా

- జిల్లా ఉపాధి కల్పన ఆధ్వర్యంలో ఉద్యోగాలు
- ప్రైవేటు అనుబంధ సంస్థల్లో ఖాళీలను గుర్తింపు
- నోటిఫికేషన్ల ద్వారా సమాచారం
- గ్రామీణ ప్రాంతాల వారికి సదావకాశాలు
- లబ్ధి పొందుతున్న నిరుద్యోగులు


జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు


ఇంటర్వ్యూ చేస్తున్న సిబ్బంది

సంగారెడ్డి టౌన్ : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరంగా మారాయి. ప్రైవేటు అనుబంధ సంస్థల్లో ఖాళీలను గుర్తించి, నిరుద్యోగులకు ఎప్పటికప్పుడూ సమాచారం అందిస్తున్నారు. అర్హతను బట్టి ప్రైవేటు పరిశ్రమల్లో ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నారు. పదో తరగతి ఆపై చదివిన వారికి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా ఎంప్లాయిమెంట్ కల్పిస్తూ నిరుద్యోగతను తగ్గిస్తున్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు 133 జాబ్ మేళాలు ఏర్పాటు చేయగా 5,118 నిరుద్యోగులు జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 1,382 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ కార్డు

నిరుద్యోగులకు ఉపాధి కార్యాలయం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉపాధి కల్పించేందుకు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఎంప్లాయిమెంట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కొన్ని రోజులపాటు కార్యాలయాల చుట్టూ తిరిగేవారు ప్రస్తుత టెక్నాలజీ అనుకూలంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కలిపించారు. ఏదైనా నెట్‌సెంటర్, మీ సేవా కేంద్రాల్లో ఎంప్లాయిమెంట్ కార్డు అప్లై చేసుకోవచ్చు. అందులో ఆధార్ కార్డు, కుల, నివాసం, విద్యార్హత, 18 ఏళ్లు నిండిన వారు ఎంప్లాయిమెంట్ కార్డును దరఖాస్తు చేసుకోవచ్చు. నిరుద్యోగతను బట్టి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది జిల్లాలోని చుట్టుపక్కల ప్రైవేట్ కంపెనీల్లో విజిట్ చేసి అందులో ఉద్యోగ ఖాళీల వివరాలను సేకరిస్తారు. అనంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తుంటారు. మారుమూల తండాల్లో నిరుద్యోగ మహిళలు, పురుషులకు ఉద్యోగాలపై అవగాహనలు కల్పించి ఉద్యోగాల్లో స్థిరపడేలా చొరవ చూపిస్తున్నారు.

బ్యాంకులో ఉద్యోగం పొందాను



ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్న సమయంలో ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించారు. ఎంబీఏ పూర్తి చేసిన నేను జాబ్ మేళాకు హాజరయ్యాను. ఎస్‌బీఐ బ్యాంకులో డెవలప్‌మెంట్ మేనేజర్‌గా ఉద్యోగం పొందాను.

– జీ.నీలిమ, సంగారెడ్డి

ఎంఆర్‌ఎఫ్ కంపెనీలో జాబ్..

ఇంటర్ విద్యార్హతతో జాబ్ కోసం ఎంతో ప్రయత్నించినా ఎక్కడ దొరకలేదు. ఈ మధ్య కాలంలో ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళా నోటిఫికేషన్ వెలువడింది. మేళాకు హాజరయ్యాను. మంచి జీతంతో ఎంఆర్‌ఎఫ్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డాను. కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు

– శ్రీనివాస్, నారాయణఖేడ్

మేళాలు నిరుద్యోగులకు వరం



ఉపాధి శిక్షణ కల్పన కార్యాలయం నుంచి ప్రతి నెలా జాబ్ మేళాలు నిర్వహిస్తుటాం. జిల్లాలోని చుట్టుపక్కల కంపెనీల్లో ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం తరచూ ప్రైవేట్ కంపెనీలను విజిట్ చేస్తున్నాం. నిరుద్యోగులు ఉద్యోగాలు పొంది లబ్ది పొందుతున్నారు.

– వందన, ఉపాధి కల్పన అధికారి

నా వంతు వ్యవసాయం



కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన ఓ చిన్నారి ఆదివారం సెలవు కావడంతో అమ్మ నాన్నతో పాటు పొలం బాట పట్టింది. పత్తి మొలకలకు యూరియా వేస్తున్న తల్లిదండ్రులను చూసి చిన్నారి చిన్న బుర్ర తీసుకొని చిట్టి చేతులతో పత్తి మొలకలకు యూరియా వేస్తూ తోటి పిల్లలకు ఆదర్శంగా సాగింది.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

ఎరువు వేస్తున్న చిన్నారి